సాక్షి
వికారాబాద్
శనివారం ၊ 31 ၊ మే ၊ 2025



రేపటికి పొదుపు

పోస్టాఫీసు ద్వారా పేదలకు ఎన్నో రకాల ప్రయోజనాలు అందిస్తున్నట్లు తపాలా శాఖ అధికారులు తెలిపారు. 10లో▸



సంత.. సమస్యల చింత

పరిగి పట్టణంలో ప్రతి శుక్ర, శనివారాల్లో నిర్వహించే సంతలో వసతులు లేక వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. 10లో▸



నేటితో ముగియనున్న..

మోమిన్‌పేటలోని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఈ నెల 31తో మూసివేయనున్నట్లు అధికారులు తెలిపారు. 11లో▸

న్యూస్‌రీల్

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఎమ్మెల్యే కాలె యాదయ్య



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

నవాబుపేట: కాంగ్రెస్ అంటే పేదలు, రైతుల ప్రభుత్వమని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శుక్రవారం మండలంలోని లింగంపల్లిలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేన్నారు. పేదలకు ఇళ్లు కట్టిస్తున్న ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. లబ్ధిదారులు వెంటనే ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రామ్‌రెడ్డి, ఎంఈఓ అబ్దుల్ రెహమాన్, మాజీ సర్పంచ్ నర్సింలు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పరమేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి,రెడ్డి, నాయకులు నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేత



బస్టాండ్ ఎదుట అక్రమ కట్టడాలను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

తాండూరు టౌన్: తాండూరు పట్టణంలోని ప్రధాన రోడ్డు మార్గానికి ఇరువైపులా వ్యాపారులు అక్రమంగా నిర్మించిన కట్టడాలను మున్సిపల్ అధికారులు శుక్రవారం కూల్చివేశారు. తాండూరు మీదుగా 167 (ఎన్) నేషనల్ హైవే వెళ్తుండటంతో ప్రధాన రోడ్డును ఇందుకు అనుగుణంగా విస్తరించనున్నారు. పనులు ఆలస్యం కావడంతో సదరు వ్యాపారులు ఇష్టానుసారంగా అనుమతి లేని చోట అక్రమంగా షెడ్లు, మెట్లు ఇతర కట్టడాలను ఏర్పాటు చేసుకున్నారు. దీంతో మున్సిపల్ అధికారులు పోలీసుల సహాయంతో కట్టడాలను కూల్చేశారు. తాండూరు బస్టాండు నుంచి చించోళి రోడ్డు మార్గంలో సెయింట్ మార్క్స్ పాఠశాల వరకు అక్రమ కట్టడాలను అధికారులు కూల్చేందుకు సమాయత్తమయ్యారు. ఈ సందర్భంగా పలువురు చిరు వ్యాపారులు అధికారుల తీరును తప్పు పట్టారు. ఏమాత్రం సమయం ఇవ్వకుండా హుటాహుటిన కూల్చేయడం సరికాదన్నారు. నిబంధనల ప్రకారమే అక్రమ కట్టడాలను తొలగిస్తున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

ఎన్ఎంఆర్‌పై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: ప్రభుత్వ విభాగాల్లో వేతన సవరణ కమిటీ పరిగణనను బట్టి దినసరి కార్మికులకు జీత భత్యాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నాన్ మస్టర్ రోల్ ఉద్యోగ వేతన స్థిరీకరణ (ఎన్ఎంఆర్)పై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విభాగాల్లో పని చేస్తున్న హాజరు పట్టిక(ఎన్ఎంఆర్)లో లేని కార్మికులకు వేతన సవరణ కమిటీ సిఫారసు మేరకు కనీస వేతనాలను అందించాలన్నారు. నైపుణ్యం, నైపుణ్యం లేని, పాక్షిక నైపుణ్యం కలిగిన దినసరి కార్మికులకు రెండు సంవత్సరాలకు ఒకసారి వేతనాల పెంపునకు అనుగుణంగా అందించాలన్నారు. గ్రామీణ, మున్సిపల్ పరిధిల్లో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ వాల్యా నాయక్, డీహెచ్ఎస్ఓ సత్తార్, డీఎంహెచ్ఓ వెంకటరవణ, విద్యుత్ శాఖ ఎస్ఈ రవి ప్రసాద్, డీబీసీడీఓ ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు కేంద్రం అండ

మొయినాబాద్: కేంద్ర ప్రభుత్వం రైతులకు అన్నివిధాలా అండగా ఉంటుందని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి అన్నారు. మండల పరిధిలోని అప్పోజీగూడ, రెడ్డిపల్లి గ్రామాల కిసాన్ కవచ్ కార్యక్రమంలో భాగంగా శ్రీ అస్పద చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్షేమ జనరల్ ఇన్సూరెన్స్ లిమిటెడ్ సహకారంతో రైతులకు మందులు పిచికారీ చేసే సమయంలో వేసుకునే కిట్లు పంపిణీ చేశారు.

నో స్టాక్..!

జిల్లాలో ఎరువుల కొరత

- ఫెర్టిలైజర్ దుకాణాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- దగ్గరపడుతున్న విత్తు సమయం
- ఆందోళనలో అన్నదాత



వికారాబాద్ పట్టణంలోని ఓ దుకాణంలలో విత్తనాలు కొనుగోలు చేస్తున్న రైతులు

వికారాబాద్: జిల్లాలో ఎరువుల కొరత రైతన్నను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై వర్షాలు కురుస్తున్న తరుణంలో ఫెర్టిలైజర్ దుకాణా ల్లో ఎరువుల కొరత ఉండటం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ సారి వర్షాలు ముందుగానే పడుతున్న నేపథ్యంలో రైతులు కూడా విత్తుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ఎరువులు, విత్తనాల కొనుగోలుపై దృష్టి సారించారు. ప్రస్తుత సీజన్‌కు అవసరమైన ఎరువుల్లో 15 శాతం కూడా అందుబాటులో లేని పరిస్థితి ఉంది. ప్రస్తుతం దుక్కి ఎరువుగా వాడాల్సిన డీఏపీ కొరత తీవ్రంగా ఉంది. దీంతో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు ఉన్నారు.

అవసరం కొండంత.. ఉన్నది గోరంత

జిల్లాలో ఎరువుల అవసరం కొండంత ఉంటే ఉన్నది మాత్రం గోరంతే. సాగుకు సరిపడా విత్తనాలు ఉండటం రైతులకు కొంత మేర ఉపశమనం కలిగిస్తోంది. ఖరీఫ్ సీజన్‌లో 5,61,719 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇందుకు 1,13,851 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రస్తుతం 14,429 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుత సీజన్‌కు 39,898 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా కేవలం 8,088 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది. డీఏపీ 27,516 మెట్రిక్ టన్నులు అవసరం కాగా 2,408 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. ఎంఓపీ 8,585 మెట్రిక్ టన్నులు అవసరం కాగా 173 మెట్రిక్ టన్నులే ఉంది. కాంప్లెక్స్ ఎరువులు 35,305 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా 3,530 మెట్రిక్ టన్నులు ఉంది. ఎస్ఎస్‌పీ ఎరువులు 2,547 మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా 230 మెట్రిక్ టన్నులు మాత్రమే అందుబాటులో ఉంది.

ఖరీఫ్ సాగు విస్తీర్ణం 5.61లక్షల ఎకరాలు

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 5.61లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఆయా పంటలు సాగు చేయవచ్చునని వ్యవసాయ అధికారులు అంచనా వేశారు. గతేడాది 2.57లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా.. ఈ సారి 2.58 లక్షల ఎకరాల్లో సాగు చేసే అవకాశం ఉందరి అంచనా వేసింది. వరి 1,31,075 ఎకరాల్లో, కందులు 1.10లక్షల ఎకరాల్లో, మొక్కజొన్న 26,908 ఎకరాల్లో సాగు చేయవచ్చని భావిస్తున్నారు. పెసలు 14,568 ఎకరాలు , మినుములు 5,716 ఎకరాలు జొన్నలు 2,572 ఎకరాలు, సోయాబీన్ 2,043 ఎకరాలు, ఇతర పంటలు 7275 ఎకరాల్లో సాగవుతాయని అంచనా వేశారు. ప్రస్తుతం వరి, మొక్కజొన్న, జీలుగ, జనుము, సోయాబీన్, కంది విత్తనాలను అందుబాటులో ఉంచారు. ఫెర్టిలైజర్, సీడ్స్ దుకాణాల్లో అవసరం మేరకు పత్తి విత్తనాలు అందుబాటు ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. జిల్లాకు ఆయా పంటలకు సంబంధించి 41,297 క్వింటాళ్ల విత్తనాలు, 5,16,426 పత్తి విత్తన ప్యాకెట్లు అవసరమని అంచనా వేశారు. ప్రస్తుతం పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

- జిల్లాలో ఖరీఫ్ సాగు విస్తీర్ణం 5,61,719 ఎకరాలు
- అవసరమైన ఎరువులు 1,13,851 మెట్రిక్ టన్నులు
- ప్రస్తుతం అందుబాటులో ఉన్నది 14,429 మెట్రిక్ టన్నులు
- అవసరమైన విత్తనాలు 41,297 క్వింటాళ్లు

ప్రభుత్వానికి నివేదించాం



ప్రస్తుత సీజన్‌కు ఏ మేరకు విత్తనాలు,ఎరువులు అవసరమో అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాం. సాగుకు సరిపడా విత్తనాలను అందుబాటులో ఉంచాం. డీఏపీ కొంత మేర కొరత ఉంది. ఈ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. త్వరలో వచ్చే అవకాశం ఉంది. నకిలీ విత్తనాల విషయంలో రైతులు జాగ్రత్తగా ఉండాలి.

– మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

వేడుకలు ఘనంగా నిర్వహిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

- కలెక్టర్ ప్రతీక్‌జైన్
- రాష్ట్ర అవతరణ వేడుకలపై అధికారులకు దిశానిర్దేశం

అనంతగిరి: జూన్ 2న రాష్ట్ర అవతరణ వేడుకలను ఘనంగా నిర్వహిద్దామని, ఇందుకోసం పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రాష్ట్ర అవతరణ వేడుకలపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వేడుకలు నిర్వహించాలని ఆదేశించారు. ఎలాంటి లోటుపాట్లకు అవకాశం ఇవ్వరాదని సూచించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా స్టాళ్లను ఏర్పాటు చేయాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. పట్టణంలోని అమర వీరుల స్తూపాన్ని, సభాస్థలి వేదికను పూలతో అందంగా అలంకరించాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు, నూతన రేషన్ కార్డులు, స్వయం సహాయక సంఘాలకు చెక్కుల పంపిణీ, గ్రామ పంచాయతీ అధికారులకు నియామక పత్రాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాట్లు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలన్నారు. పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని డీఈఓ రేణుకాదేవికి సూచించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ చేతులమీదుగా పతాకావిష్కరణ చేపట్టనున్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, అదనపు ఎస్పీ టి.వి.హనుమంత్ రావు, ఆర్డీఓ వాసుచంద్ర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్యకర్తల జోలికొస్తే ఊరుకోం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి తదితరులు

పూడూరు: తమ పార్టీ కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునేది లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొప్పుల రాజశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. పార్టీ నాయకుడు, సినిమా సెన్సార్ బోర్డు సభ్యుడు మల్లేష్ పటేల్‌పై అక్రమ కేసులు బనాయిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించరాదని హితవు పలికారు. బీజేపీ నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రాఘవేందర్, మాజీ అధ్యక్షుడు అనిల్, నాయకులు శ్రీశైలం, శివరాజ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ అడ్మిషన్లకు సెకండ్ ఫేజ్ ‘దోస్త్’

షాద్‌నగర్‌రూరల్: ఇంటర్మీడియెట్ విద్యను పూర్తి చేసిన విద్యార్థులు డిగ్రీ అడ్మిషన్లకు సెకండ్ ఫేజ్ దోస్త్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాపోలె శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఔత్సాహిక విద్యార్థినులు జూన్ 9 వరకు రిజిస్ట్రేషన్ చేసేకునేందుకు ఆవకాశం ఉంద న్నారు. ఎంపీసీ,ఎంజెడ్సీ,బీజెడ్సీ, ఎంపీసీఎస్, బీఏ,బీకాం, ఇంటిగ్రేటెడ్ పీజీ కోర్సులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరాలనుకునే విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 63050 51490, 98850 03390, 97034 41345 నంబర్లలో సంప్రదించాలని ఆమె సూచించారు.

యూరియా వాడకం తగ్గించండి

- పత్తి సాగులో మెలకువలు పాటించాలి
- రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తల సూచన

దుద్యాల్: పంట దిగుబడి పెరుగుతుందనే ఆశతో రైతులు యూరియా వాడకం పెంచారని, ఇది నష్టమే తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదని తాండూరు వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త రాజేశ్వర్ రెడ్డి, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త లక్ష్మణ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కుదురుమల్ల రైతు వేదికలో రైతు ముంగిట శాస్త్రవేత్తలు అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పంటల సాగులో రైతులు యూరియాను అధికంగా వాడుతున్నారని వెంటనే తగ్గించాలని సూచించారు. ఈ గ్రామ రైతులు అధికంగా పత్తి పంటను సాగు చేస్తుంటారని యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. పత్తి పంటకు గులాబి రంగు పురుగు ఆశించి దిగుబడిని దెబ్బతీస్తుందని.. ఎలా నివారించాలో తెలియజేశారు. వరి, కంది, పెసరు పంటల సాగులో యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. భూసారం పెరగాలంటే పచ్చిరొట్ట ఎరువు సాగు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగరాజు, కొడంగల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేణుగోపాలు, ఏఈవోలు జ్యోతి, రేణుక, భావన, మాణికేశ్వరి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, నాయకుడు సీతారాం నాయక్, మాజీ సర్పంచ్ రఘుపతి, పంచాయతీ కార్యదర్శి రాధ తదితరులు పాల్గొన్నారు.



పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

నేత్రపర్వం.. రథోత్సవం

- వైభవంగా రేణుక ఎల్లమ్మ జాతర
- అమ్మవారి సేవలో ప్రముఖులు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



రథాన్ని లాగుతున్న భక్తులు

తాండూరు రూరల్: మండలంలోని కొత్లాపూర్‌లో కొలువు దీరిన రేణుక ఎల్లమ్మ జాతర నెల రోజులగా వైభవంగా సాగుతోంది. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రథోత్సవం, సిడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఆలయ చైర్మన్ నవీన్‌రెడ్డి అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా ఆలయానికి తెచ్చారు. సిడేను పూలతో అందంగా అలంకరించారు. రథోత్సవం, సిడే ఊరేగింపులో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. కర్ణాటక మాజీ మంత్రి అరవింద్ లింబావళి, ఫైనాన్స్ కమిటీ సభ్యుడు రమేష్ మహరాజ్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి వేడుకల్లో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ విఠల్‌రెడ్డి, ఏఎస్ఐలు రాజశేఖర్, పవన్‌కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వేడుకల్లో ఆలయ ఈవో శేఖర్ గౌడ్, మాజీ చైర్మన్ సందీప్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణంలో నాణ్యత పాటించాలి

మొయినాబాద్ రూరల్: ఈసీ వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు నాణ్యతతో ఉండాలని జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ శ్రీరాములు, సీఈ జోగిరెడ్డి అన్నారు. నక్కలపల్లి–హైతాబాద్ మధ్యలో ఈసీ వాగుపై కొనసాగుతున్న వంతెన పనులను శుక్రవారం వారు మండల డిప్యూటీ డీఈ విజయ్‌కుమార్‌తో కలిసి పర్యవేక్షించారు. ఈసీవాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం గత ప్రభుత్వం సీఆర్ఆర్ కింద రూ.5 కోట్లు మంజూరు చేసినట్లు విజయ్‌కుమార్ అధికారులకు తెలిపారు. పనులు జరుగుతున్న తీరును వారికి వివరించారు. అధికారులు మాట్లాడుతూ.. వంతెన నిర్మాణంలో ఎలాంటి జాప్యం లేకుండా నాణ్యతతో నిర్మించేలా చూడాలని సూచించారు.

ప్రజలను చైతన్య పరచాలి

డీఈఓ రేణుకాదేవి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డీఈఓ రేణుకాదేవి

అనంతగిరి: మానవ అక్రమ రవాణాను అరికట్టడానికి ఉపాధ్యాయులు తమ వంతుగా ప్రజలను చైతన్య పరచాలని డీఈఓ రేణుకాదేవి సూచించారు. శుక్రవారం వికారాబాద్‌లోని డైట్ కళాశాలలో కస్తూర్బా గాంధీ, ఆదర్శ పాఠశాలలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి ఇద్దరు ఉపాధ్యాయులకు మానవ అక్రమ రవాణాను అరికట్టడంపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామాజిక బాధ్యతగా ఉపాధ్యాయులు మానవ అక్రమ రవాణా అరికట్టడంలో తమ వంతు పాత్ర వహించాలన్నారు. మానవ అక్రమ రవాణా సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 1098, 100, 181, 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ రిసోర్స్ పర్సన్ శ్రీకాంత్, సుప్రియ శ్రీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగు పర్చుకోవాలి

పూడూరు: ఉపాధ్యాయులు విద్యా ప్రమాణాలను మెరుగు పర్చుకుని బోధన చేయాలని డీఈఓ రేణుకాదేవి సూచించారు. శుక్రవారం మండలంలోని మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. కార్యక్రమంలో గెస్ట్ లెక్చరర్ వీరయ్య, కోర్సు డైరెక్టర్ సాయిరెడ్డి, మానిటరింగ్ అధికారి రామ్ మస్తాన్, సెక్టోరియల్ అధికారి రమేష్, డీఆర్పీలు రవికుమార్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

అభివృద్ధిలో అగ్రగామి

- రూ.10 వేల కోట్లతో పనులు
- శరవేగంగా నిర్మాణాలు
- సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి

కొడంగల్: నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో అభివృద్ధిలో అగ్రగామిగా నిలుస్తోంది. గడిచిన ఏడాదిన్నర కాలంలో సుమారు రూ.10 వేల కోట్లతో నియోజకవర్గం దశ దిశ మార్చేలా పనులు సాగుతున్నాయి. విద్య, వైద్యం, ఉపాధి రంగాలకు మొదటి ప్రాధాన్యత కల్పించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాల, వృత్తి విద్యా కళాశాల, ఇంజనీరింగ్, నర్సింగ్ కళాశాలలు, వ్యవసాయ పరిశోధనా కేంద్రం, మహిళా డిగ్రీ కళాశాల, పీజీ, జూనియర్ కళాశాలలు మంజూరు చేశారు. కొడంగల్ పట్టణంలో 220 పడకల ప్రభుత్వ టీచింగ్ ఆస్పత్రి పనులు చకచకా సాగుతున్నాయి. రూ.6 కోట్లతో ఆర్‌అండ్‌బీ అతిథి గృహం నిర్మిస్తున్నారు. రోడ్ల విస్తరణ పనులు ఊపందుకున్నాయి. అభివృద్ధి పనుల్లో వేగం పెంచినట్లు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి తెలిపారు.



కొడంగల్‌లో చురుగ్గా సాగుతున్న ప్రభుత్వ టీచింగ్ ఆస్పత్రి భవన నిర్మాణం



హస్నాబాద్‌లో నిర్మిస్తున్న పాఠశాల భవనం



బొంరాస్‌పేట మండలంలో పూర్తయిన బీటీ రోడ్డు



కొడంగల్‌లో నిర్మిస్తున్న ఆర్‌అండ్‌బీ అతిథి గృహం

క్లుప్తంగా

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన శుక్రవారం మున్సిపల్ పరిధిలోని సోలీపూర్ శివారులోగల బీబీజీ వెంచర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ దేవరాజ్ తెలిపిన ప్రకారం.. బీబీజీ వెంచర్‌లోని నిర్మానుష్య ప్రాంతంలో గుర్తు తెలియని మహిళ(28) మృతదేహం ఉన్నట్లు వెంచర్ నిర్వాహకులు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియచేశారు. సమాచారం అందుకున్న ఎస్ఐ దేవరాజ్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి వివరాలు తెలియరాలేదు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉండటం, ఎముకలు తేలిపోవడం చూస్తుంటే 10 రోజుల క్రితమే మహిళ మృతి చెంది ఉండవచ్చని భావిస్తున్నారు. మహిళ ఆత్మహత్యకు పాల్పడిందా..? గుర్తు తెలియని వ్యక్తులు తీసుకువచ్చి హత్య చేశారా అనే కోణంలో విచారిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వెంచర్ సూపర్‌వైజర్ ఇంద్రారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వృద్ధుడి అదృశ్యం


షేక్ మహబూబ్(ఫైల్)

పహాడీషరీఫ్: అనారోగ్యంతో బాధపడుతున్న వృద్ధుడు అదృశ్యమైన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పహాడీషరీఫ్‌కు చెందిన షేక్ మహబూబ్(70), షానవాజ్ బేగం దంపతులు దర్గా వద్ద నివాసం ఉంటున్నారు. ఐదు నెలలుగా మహబూబ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నెల క్రితం చివరగా కుమారుడు ముజఫర్‌తో ఫోన్‌లో మాట్లాడిన మహబూబ్ అనంతరం అందుబాటులోకి రాలేదు. అప్పటి నుంచి అతని ఆచూకీ కోసం గాలించినా ఫలితం లేకుండా పోయింది. ఈ విషయమై ముజఫర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు.

రేపటి నుంచి ఓయూలో తరగతులు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌తో పాటు అనుబంధ, ప్రైవేటు కాలేజీలలో జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. నెల రోజుల వేసవి సెలవుల అనంతరం తిరిగి తరగతులను పునఃప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వర్సిటీ క్యాంపస్‌లో కాలేజీలతో పాటు హాస్టల్స్, మెస్సులను కూడ పునఃప్రారంభించనున్నారు.

అప్పు తీసుకుని చెక్కేశాడు

- ఇద్దరు మహిళల పేరుతో రూ. 25 లక్షల రుణం
- యువకుడిపై కేసు నమోదు

వెంగళరావునగర్: ఓ వ్యక్తి ఇద్దరు మహిళల పేరున రూ.25 లక్షలు రుణం తీసుకుని మోసం చేసిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. యాదగిరినగర్‌కు చెందిన యూ ట్యూబర్‌గా పని చేస్తోంది. ఆమెకు పరిచయస్తురాలైన నాగరాణి అనే యువతి గత ఏడాది రాజశేఖర్ అనే వ్యక్తిని పరిచయం చేసింది. అతను దీవెనకు ఫోన్ చేసి అకౌంట్ నెంబర్ అడిగి ప్రతినెల రూ. 20 వేలు నగదు డిపాజిట్ చేస్తానని చెప్పాడు. దీంతో ఆమె ఈ విషయాన్ని తన స్నేహితురాలు నవజ్యోతికి వివరించి ఇద్దరి నెంబర్లు ఇస్తామని, ఇరువురికీ నగదు వేయాలని రాజశేఖర్‌ను కోరింది. అందుకు అంగీకరించిన అతను వారి నుంచి ఆధార్‌కార్డులు, వేలిముద్రలు, తీసుకుని వారి పేరున బ్యాంక్ ఖాతాలు తెరిచాడు. మూడు నెలల పాటు ఆయా అకౌంట్లలో నగదు డిపాజిట్ చేసిన అతను, నాలుగో నెల వేయలేదు. దాంతో వారు బ్యాంకులకు వచ్చి ఆరా తీయగా దీవెన పేరున రూ. 10 లక్షలు, నవజ్యోతి పేరుతో రూ. 15 లక్షలు రుణం తీసుకున్నట్లుగా తెలిసింది. తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితులు రాజశేఖర్‌పై చర్యలు తీసుకోవాలని మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రేపటికి పొదుపు

- పోస్టాఫీసుల్లో పేద, మధ్య తరగతివారికి పాలసీలు
- అరచేతిలో ఆన్‌లైన్ సేవలు


కొడంగల్ పోస్టాఫీసు

కొడంగల్ రూరల్: చిన్న మొత్తం పొదుపుతో పెద్ద లాభాలను అందజేస్తూ పోస్టాఫీసు ద్వారా పేద, మధ్య తరగతి వారికి ఎన్నో రకాల ప్రయోజనాలు అందిస్తున్నట్లు తపాలా అధికారులు వెల్లడిస్తున్నారు. వివిధ రకాల పెట్టుబడి, పొదుపు అవకాశాలను పోస్టాఫీసు అందిస్తుందని, ఈ పథకాలు ముఖ్యంగా చిన్న మొత్తాల పెట్టుబడి కోసం, భద్రత కోసం, మంచి వడ్డీరేట్లు అందించడం కోసం ఉపయోగపడతాయని పేర్కొంటున్నారు. పోస్టాఫీసు పథకాలు లాభదాయకమైన పెట్టుబడి అవకాశాలను అందిస్తూ ప్రభుత్వ మద్దతుతో పెట్టుబడిదారులకు ఆర్థిక భద్రతను అందిస్తున్నాయి.

పోస్ట్‌ఇన్ఫో యాప్

మార్కెట్లో పెరుగుతున్న పోటీని తట్టుకుంటూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడంపై తపాలా శాఖ దృష్టిసారించిందని అధికారులు పేర్కొంటున్నారు. ఇందుకు శాఖ ఆధ్వర్యంలో అందించే సేవలను ఆన్‌లైన్ విధానంలోకి తీసుకువచ్చామన్నారు. దీనికి తోడుగా రెండేళ్ల క్రితం పోస్టు ఇన్ఫో పేరిట యాప్ ప్రవేశపెట్టి ఇటీవల మరికొన్ని సేవలను జతచేశారని వివరిస్తున్నారు. యాప్ డౌన్‌లోడ్ చేసుకుంటే సేవలు సులభమవుతాయని పోస్టల్ అధికారులు చెబుతున్నారు.

బీమా పాలసీలు..

పేద మధ్య తరగతి వారికి అందుబాటులో ఉండేలా పోస్టాఫీసులో గ్రూప్ యాక్సిడెంట్ గార్డు పాలసీని ప్రవేపెట్టారు. రూ.599 ప్రీమియంతో రూ.10 లక్షల బీమా, రూ.799 ప్రీమియంతో రూ.15లక్షల బీమా పాలసీని అందుబాటులోకి తెచ్చింది, పాలసీదారుడికి ఎలాంటి ప్రమాదం జరిగినా బీమా తీసుకున్నప్పటినుంచి ఏడాది పాటు కవరేజ్ వర్తిస్తుందని, 18ఏళ్ల నుంచి 65 ఏళ్ల వయస్సు వారికి ఈ పాలసీ వర్తిస్తుందని, 2022ఏప్రిల్‌లో తొలిసారిగా ప్రవేశపెట్టింది. ఇప్పటికే మహబూబ్‌నగర్ డివిజన్‌లో అధిక సంఖ్యలో పాలసీ తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా పోస్టాఫీసులో మరికొన్ని పథకాలు ఉన్నాయి. పోస్టాఫీసు మంత్లీ ఇన్‌కమ్ పాలసీ, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్(పీపీఎఫ్), సుకన్య సమృద్ధి యోజన, కిసాన్ వికాస్ పత్ర, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్, సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ వంటి అనేక పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



పోస్టాఫీసు ద్వారా తక్కువ ప్రీమియంతో ఎక్కువ ప్రయోజనం చేకూర్చే ప్రమాద బీమా, ఆరోగ్య బీమా, మోటారు బీమా పాలసీలను అందిస్తున్నాం. గ్రామాల్లోని పోస్టాఫీసుల్లో బ్రాంచ్ పోస్టుమాస్టర్ ద్వారా సేవలను పొందవచ్చు. అర్హులైన ప్రతీ ఒక్కరూ ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలి.

– ఎస్.విజయజ్యోతి, తపాలాశాఖ పర్యవేక్షకులు, మహబూబ్‌నగర్ జిల్లా

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

- జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి
- సంత్రకుంట తండాలో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణానికి భూమిపూజ


దుద్యాల్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్ అన్నారు. శుక్రవారం వారు మండల పరిధిలోని సంత్రకుంట తండాలో నూతన పాఠశాల భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా రాజేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. గతంలో తండాలో ఒకే భవనంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ పంచాయతీ కార్యాలయాలు కొనసాగడంతో ఇబ్బందులు తలెత్తాయని ప్రభుత్వానికి విన్నవించడంతో నూనత భవనానికి రూ.41లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్ద పీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈఈ సురేందర్ రెడ్డి, కొడంగల్ ఏఎంసీ వైస్ చైర్మన్ వేణుగోపాల్, పంచాయతీ కార్యదర్శి కిషన్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటయ్య, సీనియర్ నాయకుడు సీతారాం నాయక్, కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవి నాయక్, కృష్ణ, సత్యానారాయణ, నాయకులు రాహుల్, లక్ష్మయ్య, మొగులయ్య, మన్య నాయక్, పెంటప్ప, సాలియన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పుమళ్లలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాల పంపిణీ

బొంరాస్‌పేట: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పేదల సొంతింటి కల నెరవేరుతోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఏర్పుమళ్లలో ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. అనంతరం ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింలుగౌడ్, జయకృష్ణ, వెంకట్రాములుగౌడ్, రాంచంద్రారెడ్డి, అంజిల్‌రెడ్డి, మల్లికార్జున్ తదితరులున్నారు.


పాఠశాల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు, అధికారులు

తునికాకు కూలీలకు తిప్పలు


రుద్రారంలో నిల్వ ఉంచిన తునికాకు సంచులు

- కూలి డబ్బుల చెల్లింపులో జాప్యం
- నిర్వాహకుల ఇళ్లను ముట్టడించిన కూలీలు

ధారూరు: పేదలకు తునికాకు సేకరణ ప్రధాన ఆదాయ వనరు. నలభై రోజులు అడవిలో తునికాకు సేకరించి కళ్లాల్లో విక్రయించిన కూలీలకు డబ్బులు చెల్లించకపోవడంతో శుక్రవారం వారు నిర్వాహకుల ఇళ్లను ముట్టడించారు. దీంతో సదరు నిర్వాహకులు ఫారెస్ట్ అధికారుల వద్దకు పరుగులు తీశారు. మండల పరిధిలోని పలుగ్రామాల కూలీలు ఏప్రిల్ 21 నుంచి మే 30 వరకు 3,04,600 తునికాకు కట్టలు సేకరించి నిర్వాహకులు ఏర్పాటు చేసిన కళ్లాల్లో విక్రయించారు. ఇందుకు సంబంధించి ఒక్కో కట్టకు రూ.3.30 చెల్లించాల్సి ఉంటుంది. నాటి నుంచి కాంట్రాక్టర్ చెల్లిస్తాడని నిర్వాహకులు, ఫారెస్ట్ అధికారులు చెల్లిస్తారని కాంట్రాక్టర్ బదులిస్తూ వచ్చారు. ఇందుకు సంబంధించి రూ.10.05లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందుకు సంబంధించి కూలీల బ్యాంకు ఖాతాలు తీసుకుని వివరాలు ఆన్‌లైన్ చేశామని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. తమకు పోషణ భారమైందని అధికారులు త్వరితగతిన తమ డబ్బులు జమ చేయాలని కూలీలు కోరుతున్నారు.

సేకరణ వివరాలు

గ్రామం	కూలీలు	సేకరించిన తునికాకు(కట్టలు)
గడ్డమీది గంగారం	25	66,500
అల్లాపూర్	20	66.350
రుద్రారం	20	30,500
గట్టెపల్లి	18	52,000
రాంపూర్	21	30,000
రేగొండి	20	30,250
రాస్నం	-	29,000

త్వరలోనే ఖాతాలో జమ

కూలీలు సేకరించిన కల్లాల్లో విక్రయించిన తునికాకు కట్టలకు సంబంధించిన వివరాలు, వారి ఖాతా వివరాలు జిల్లా ఫారెస్ట్ కార్యాలయానికి పంపించాం. పాలనపరమైన సమస్యల కారణంగా డబ్బు చెల్లింపులో జాప్యం చోటు చేసుకుంది. కూలీలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. త్వరలోనే వారి ఖాతాల్లో నగదు జమ చేస్తారు. – రాజేందర్, ఎఫ్ఆర్ఓ, ధారూరు

అంత్యక్రియలకు వెళ్లొచ్చేసరికి చోరీ

రూ.15లక్షల నగదు అపహరణ

కొత్తూరు: బంధువుల అంత్యక్రియలకు వెళ్లి తిరిగి వచ్చేలోగా గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి బీరువాలోని నగదును ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన మున్సిపల్ పరిధిలోని తిమ్మాపూర్ రైల్వేస్టేషన్ కాలనీలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీగౌడ్ తెలిపిన ప్రకారం.. కాలనీలో నివాసం ఉంటున్న యువజన కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు వన్నాడ శివశంకర్‌గౌడ్ ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి షాబాద్‌లో బంధువుల అంత్యక్రియలకు హాజరయ్యాడు. సాయంత్రం ఇంటికి వచ్చే వరకు తాళాలు పగులగొట్టి ఉండడంతో అనుమానంతో పరిశీలించగా చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. బీరువాలో ఉన్న రూ.15 లక్షల నగదును ఎత్తుకెళ్లినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

నైపుణ్యంతోనే మెరుగైన అవకాశాలు

సాక్షి,సిటీబ్యూరో: యువత నైపుణ్యం లేకపోతే ఏ రంగంలోనూ రాణించలేరని, నిరాశ, నిరుద్యోగం దేశ అభివృద్ధిని మింగేస్తాయని ఈథేమ్స్ బిజినెస్ స్కూల్ చైర్మన్ కాశీ ప్రసాద్ అన్నారు.దేశ జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్ల లోపువారేనని, కానీ వీరికి తగిన నైపుణ్యత లేకపోవడం పరిస్థితి భారంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భారత్ ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే ఒక కఠినమైన వాస్తవాన్ని ఎదుర్కోవాల్సిందేనన్నారు. దేశంలోని పట్టభద్రుల్లో 48 శాతం మంది ఉద్యోగయోగ్యులు కారని, ఇండియా స్కిల్స్ రిపోర్ట్ ప్రకారం ప్రతి సంవత్సరం కోటి మందికి పైగా విద్యార్థులు డిగ్రీలు పొందుతున్నా.. కంపెనీలు మాత్రం ఉద్యోగానికి సరిపోయే నైపుణ్యాలున్న అభ్యర్థులను ఎంపిక చేయడంలో ఇబ్బందులు పడుతున్నాయన్నారు. 'ఏఐ ఉద్యోగాలను తీసేస్తోందని, కానీ యువతకు తగిన నైపుణ్యం ఉన్నదా?' అని ఆయన ప్రశ్నించారు. డిగ్రీ ఆధారిత నియామకాల యుగం ముగిసిందని, నైపుణ్యాధారిత నియామకమే భవిష్యత్ అని తెలిపారు.

డీసీఎం ఢీకొని రైతు దుర్మరణం


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు


ప్రమాదానికి కారణమైన డీసీఎం


కిష్టయ్య(ఫైల్)

నవాబుపేట: మద్యం మత్తులో వాహనం నడిపిన డీసీఎం డ్రైవర్ ఓ రైతు నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాడు. ఈ ఘటన శుక్రవారం మండల పరిధిలోని వట్టిమీనపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అరుణ్‌కుమార్, స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన గొల్ల కిష్టయ్య(54) మధ్యాహ్నం పశువులను మేపేందుకు పొలానికి వెళ్తున్నాడు. శంకర్‌పల్లి నుంచి మద్యం మత్తులో డీసీఎంను నడుపుతున్న డ్రైవర్ రైతును ఢీకొట్టాడు. దీంతో కిష్టయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన రైతులు వాహనాన్ని వెంబడించగా మరింత వేగంగా వెళ్లి పులుమామిడి గేటు వద్ద కల్వర్టుని ఢీకొట్టి పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లి వాహనం నిలిచిపోయింది. డ్రైవర్‌ను పట్టుకున్న గ్రామస్తులు పోలీసులకు అప్పగించారు. మృతుడికి భార్య స్వరూప, కొడుకు మల్లేశ్, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే పీడీ యాక్ట్


అబ్దుల్లాపూర్‌మెట్: విత్తన, ఎరువుల డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఏ సుజాత


మహేశ్వరం: మాట్లాడుతున్న ఏడీఏ సుధారాణి

వ్యవసాయశాఖ ఏడీఏ సుజాత

అబ్దుల్లాపూర్‌మెట్: నకిలీ విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు విక్రయించి రైతులను మోసం చేసే డీలర్లపై కఠిన చర్యలతో పాటు పీడీ యాక్ట్ నమోదు చేస్తానమి వ్యవసాయ శాఖ ఏడీఏ సుజాత హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో వ్యవసాయ, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ మండలాల్లోని అధీకృత డీలర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుజాత మాట్లాడుతూ.. డీలర్లు విధిగా రికార్డులు నిర్వహించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు పోలీసుల సహకారంతో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తూ నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయశాఖ అధికారిణి పల్లవి, ఎస్ఐ భద్యానాయక్, డీలర్లు పాల్గొన్నారు.

రైతులకు రసీదులు ఇవ్వాలి

మహేశ్వరం: ఎరువులు, విత్తనాల దుకాణాదారులు రైతులకు అధిక ధరలకు విక్రయించరాదని మహేశ్వరం వ్యవసాయ శాఖ ఏడీఏ సుధారాణి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఎరువులు, విత్తనాల దుకాణాదారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎరువులు, విత్తనాల డీలర్లు స్టాక్, బిల్ బుక్స్ సక్రమంగా నిర్వహించాలన్నారు. రైతులు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. అనుమతిలేని మందులు, విత్తనాలు, పురుగుల మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగమణి, డివిజన్ టెక్నికల్ అధికారి యాదగిరిగౌడ్, డీలర్లు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు అమ్మితే చర్యలు

వ్యవసాయ శాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి


రైతులు కొనుగోలు చేసిన విత్తనాలను పరిశీలిస్తున్న మోహన్‌రెడ్డి తదితరులు

పూడూరు: రైతులకు నాసిరకమైన విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మండల పరిధిలోని కుత్బుల్లాపూర్‌లో రైతులు కొనుగోలు చేసిన పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకుని ల్యాబ్‌కు పంపించారు. గడ్డి మందును తట్టుకునే పత్తివిత్తనాల వల్ల నష్టాల గురించి రైతులకు వివరించారు. ల్యాబ్ నుంచి వచ్చే రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. రశీదులు లేకుండా విత్తనాలు కొనుగోలు చేయొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ వ్యవసాయ అధికారి లక్ష్మీకుమారి, మండల అధికారి తులసీరాం, చన్గోముల్ ట్రైనీ ఎస్ఐ ప్రవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింగ్ హోం సీజ్


ప్రజావైద్యశాల నర్సింగ్‌హోం తనిఖీకి వచ్చిన వైద్యబృందం


ఆస్పత్రిని సీజ్ చేసిన అధికారులు

చేవెళ్ల: ఆపరేషన్ వికటించి వ్యక్తి మృతి చెందిన ఘటనలో చేవెళ్లలోని విజయ్ నర్సింగ్ హోం (ప్రజావైద్యశాల)ను వైద్యాధికారుల బృందం శుక్రవారం సీజ్ చేసింది. మున్సిపల్ పరిధిలోని కేసారం గ్రామానికి చెందిన కల్లెంల నర్సింలుకు విజయ్‌నర్సింగ్‌హోంలో ఆపరేషన్ చేశారు. వైద్య వికటించడంతో ఆయన గురువారం మృత్యువాత పడడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనలు చేపట్టారు. వైద్యాధికారులకు అందిన ఫిర్యాదు మేరకు జిల్లా వైద్యాధికారులు చేవెళ్ల డిప్యూటీ డీఎంహెచ్ఓ వైద్య బృందాన్ని తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఈ మేరకు నర్సింగ్ హోంకు వచ్చిన అధికారులు ఆస్పత్రికి తాళం వేసినట్లు గుర్తించారు. ఫోన్ సంప్రదించేందుకు యత్నించినా అందుబాటులోకి రాలేదు. దీంతో వైద్యాధికారుల బృందం ఆస్పత్రిని సీజ్ చేశారు. ఆస్పత్రి వైద్యాధికారుల విచారణ పూర్తయ్యే వరకు తాళం తీయొద్దని హెచ్చరించారు. గతంలోనూ ఈ నర్సింగ్‌హోంను వైద్యాధికారులు తనిఖీ చేసిన సమయంలో కాలం చెల్లిన మందులు ఉన్నాయని నోటీసులు జారీ చేసిన ఇప్పటీ వరకు స్పందించలేదన్నారు. ఈ తనిఖీల్లో మొయినాబాద్ వైద్యాధికారి అన్నపూర్ణ, చేవెళ్ల సబ్ సెంటర్ వైద్యురాలు వేదశ్రీ తదితరులు ఉన్నారు.

సంత.. సమస్యల చింత

- పారిశుద్ధ్య లోపంతో చిత్తడిగా మారిన మార్కెట్ యార్డు
- ఇబ్బందులు పడుతున్న రైతులు
- పట్టించుకోని పాలకులు


పరిగి మార్కెట్ యార్డు దుస్థితి

పరిగి: పట్టణంలోని మార్కెట్ యార్డులో ప్రతీ శుక్ర, శనివారం సంత కొనసాగుతుంది. ఇక్కడకు వచ్చే రైతులు, ప్రజలు మౌలిక వసతులు లేక ఇబ్బంది పడుతున్నారు. ఎటు చూసినా సమస్యలే దర్శనమిస్తున్నాయి. మార్కెట్ యార్డుకు ధాన్యం, కూరగాయాలు ఇతర పనులపై వచ్చిన రైతులకు కనీస సౌకర్యాలు లేక సతమతమవుతున్నారు. లక్షల్లో ఆదాయం ఉన్నా సౌకర్యాలు కల్పనలో అధికారులు విఫలమవుతున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. పరిగి దోమ, కుల్కచర్ల, పూడూర్, బొంరాస్‌పేట్ తదితర మండలాల నుంచి రైతులు, వ్యాపారస్తులు ప్రతీ శుక్రవారం, శనివారాల్లో సంతలో ధాన్యం, కూరగాయల క్రయ, విక్రయాలకు వస్తుంటారు. ఇందుకు మార్కెట్ కమిటీకి కొంత రుసుము చెల్లించాల్సి ఉంటుంది. పశువుల సంతలో పశువులు కొనుగోలు చేసిన, అమ్మినా రైతులు, వ్యాపారస్తులు మార్కెట్‌కు డబ్బులు చెల్లించాలి. ఇలా వచ్చే సొమ్ములోనూ అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారనే అపవాదు లేకపోలేదు.

కంపు కొడుతున్న మార్కెట్ యార్డు

మార్కెట్ యార్డుతో ఎక్కడ చూసినా కంపు కొడుతోంది. మార్కెట్‌కు కూరగాయలు తెచ్చే రైతులు, వ్యాపారస్తులు కుళ్లిన కూరగాయలు వదిలి వెళ్తున్నారు. దీంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నారని పలువురు వాపోతున్నారు. మార్కెట్ ఆదాయంపై దృష్టి సారిస్తున్న అధికారులు పారిశుద్ధ్య పనులపై అలసత్వం వహిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సమాచారం ఇచ్చినా కన్నెత్తి చూడడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.

ఆదాయం దండి

మార్కెట్ యార్డుకు ఆదాయం వస్తున్నా.. అధికారులు మౌలిక వసతలు కల్పన, పారిశుద్ధ్యం తదితర పనులు చేపట్టడం లేదు. ధాన్యం విక్రయంలోనూ మార్కెట్ ఆదాయాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు కొంత మంది వ్యాపారస్తులతో కుమ్మక్కై చిట్టీలు లేకుండానే పశువుల క్రయ, విక్రయాలు చేపట్టి మార్కెట్ ఆదాయానికి గండి కొడుతున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

అధికారులు పట్టించుకోవట్లే..



రైతులు క్రయ విక్రయాలు చేస్తేనే మార్కెట్‌కు ఆదాయం సమకూరుతుంది. కానీ రైతులకు సౌకర్యాలు కల్పించడంలో పరిగి మార్కెట్ యార్డు అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. కోట్లలో ఆదాయం సమకూరుతున్నా మార్కెట్ యార్డు అపరిశుభ్రంగానే ఉంటుంది.

– మల్లేష్, రైతు, మిట్టకోడూర్